క్లుప్తంగా

స్టాక్ పాయింట్ పరిశీలన



బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఉన్న పుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ రాజకుమార్

బలిజిపేట: మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు నిల్వ ఉంచిన స్టాక్ పాయింట్‌ను డిప్యూటీ డీఈఓ రాజకుమార్ బుధవారం పరిశీలించారు. మండలానికి 2,999మందికి పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు 47టైటిల్స్ (పాఠ్యపుస్తకాలు)గా నిర్ధారించారు. వాటిలో 42టైటిల్స్ రాగా మరో 5టైటిల్స్ రావాల్సి ఉంది. అదేవిధంగా 18,288నోట్స్ పుస్తకాలు వచ్చాయి. వాటిని సక్రమంగా భద్రపరిచింది? లేనిది? డిప్యూటీ డీఈఓ రాజకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీరామాలయ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

బలిజిపేట: మండలంలోని బడేవలసలో శ్రీరామాలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండవరోజు సూర్యనమస్కారాలు, ప్రత్యేక పూజలు చేశారు. యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ, మంటప అర్చనలు, సర్వదేవతా హోమాలు, ఆరోగ్యప్రదాత సూర్యనారాయణస్వామికి సూర్యనమస్కారాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఏక పాత్రాభినయ పౌరాణిక పద్యపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన



పూజలందుకుంటున్న గోవిందమాంబ-వీరబ్రహ్మేంద్ర స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అర్చకుడు పోలాకి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆరాధన పూజలు ఘనంగా జరిగాయి. వైశాఖ శుద్ధదశమి జగద్గురు శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా, గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామివారికి ఆరాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న కమిటీసభ్యులు

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ వెంకటాపురంలో గ్రామస్తులు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అగమ వేదపండితుల పర్యవేక్షణలో అభయాంజనేయస్వామికి వంద లాది మంది భక్తులతో కలశాలు, పూజా సామగ్రితో పూజలు జరిగాయి. గురువారం స్వామివారి ఆలయ ప్రతిష్ఠ అనంతరం అన్నప్రసాదాల వితరణ జరుగుతుందని ఉత్సవకమిటీ సభ్యుడు ఎస్.మహేశ్వరరావు తెలియజేశారు.

భారత్ దీటైన జవాబు



యిండుపూరు గున్నేశ్వరరావు

సాక్షి, పార్వతీపురం మన్యం: ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు, ఉగ్రవాదులకు భారత ప్రభుత్వం గట్టి జవాబిచ్చిందని పార్వతీపురం మున్సిపల్ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యిండుపూరు గున్నేశ్వరరావు అన్నారు. కేంద్రం, ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాన్ని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. పహల్గాంలో అమాయక ప్రాణాలను పొట్టన పెట్టుకుని, మన ఆడపడుచుల కన్నీటికి కారణమైన ఉగ్రవాదులకు..ఆడబిడ్డలతోనే ఆపరేషన్ సిందూర్ నిర్వహించి దీటైన బదులిచ్చారని ప్రశంసించారు. ధైర్యసాహసాలు ప్రదర్శించిన మన సైనికులకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత సాయుధ దళాలను చూసి తాము గర్విస్తున్నామని పేర్కొన్నారు.

ఓ వైపు నిర్లక్ష్యం.. మరో వైపు వెగటు..!

- ఏమైంది సాలూరు మున్సిపాలిటీకి?
- పండగ సమీపిస్తున్నా ప్రారంభంకాని పనులు
- ప్రజలు, భక్తుల్లో ఆందోళన



మున్సిపాలిటీ తీరుపై వాపోతున్న మంత్రి సంధ్యారాణి (ఫైల్)

సాలూరు:

సాక్షాత్తు గిరిజన సంక్షేమం, స్త్రీశిశుసంక్షేమ శాఖ మంత్రి, గుమ్మడి సంధ్యారాణి ప్రాతి నిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలోని సాలూరు మున్సిపాలిటీ పరిస్థితి దయనీయంగా ఉంది. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శోభిక సమక్షంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ ఉండగానే సాలూరు మున్సిపాలిటీ తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేసిన విషయం విదితమే. అలాగే తాను విధుల్లో చేరిన వారం రోజుల్లో రెండుసార్లు కలెక్టర్ నుంచి మందలింపులకు గురయ్యాయని, తన మాట మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు వినడం లేదంటూ మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు మంత్రి, ఇన్‌చార్జ్ కలెక్టర్ సమక్షంలో వాపోయిన పరిస్థితి. ఈ మాటలు ప్రస్తుత మున్సిపాలిటీ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. 15 ఏళ్ల తరువాత సుమారు 10 లక్షల మందికి పైగా భక్తులు రానున్న శ్యామలాంబ పండగకు శాఖాపరంగా టెండర్లు ఖరారు కాని పనులు. సాలూరులో సిండికేట్‌గా మారిన మద్యం దుకాణాలు, కొరవడుతున్న పారిశుధ్యం, చాలా అంశాల్లో మున్సిపాలిటీ పరిస్థితి దారుణంగా ఉంది.

ఖరారు కాని టెండర్లు

సాలూరులో ఏటా జరిగే వినాయక ఉత్సవాలనే అంగరంగ వైభవంగా జరుపుతుంటారు. అటువంటిది 15 ఏళ్ల తరువాత జరుగుతున్న శ్యామలాంబ అమ్మవారి పండగ ఏ విధంగా జరుగుతుందని అందరూ ఆశిస్తారో ఊహించవచ్చు. అటువంటి పండగ కోసం దాదాపు పదిరోజుల ముందుగానే పనులు పూర్తిచేసి సిద్ధంగా ఉంచాలి. అయితే మున్సిపాలిటీలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. రూ.కోటి 36 లక్షల పనులకు ఈ నెల 9న టెండర్లు ఖరారుకానున్నాయంటే, అక్కడ నుంచి కనీసం పదిరోజులు కూడా పండగకు సమయం లేని పరిస్థితుల్లో ఆ పనులు ఎంత నాణ్యంగా జరుగుతాయో, ఎంతవరకు పూర్తవుతాయోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి పెద్దల తాత్సారం

కూటమి ప్రభుత్వ పెద్దలు ఈ పనులపై స్పష్టత ఇవ్వకుండా తాత్సారం చేయడం వల్లనే అధికారులు ఇప్పటివరకు ఆ పనులకు టెండర్లు పిలవలేని పరిస్థితి ఏర్పడి ఉండవచ్చని, లేకుంటే ఇంత పెద్ద పండుగ పనులకు సంబంధించి అధికారులు ఎందుకు ఇంత అలక్ష్యం చేస్తారని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎవరికి వారే.. యమునా తీరే చందాన..

కూటమి ప్రభుత్వంలో సరైన మున్సిపల్ కమిషనర్ లేక మున్సిపాలిటీలో ఉద్యోగులు, సిబ్బంది,సచివాలయ ఉద్యోగులు చాలా మంది ఎవరికి వారే యమునా తీరే చందాన వ్యవహరిస్తున్నారు. ఎవరు ఎప్పుడు వస్తారో, వచ్చి ఎక్కడికి వెళ్తారో తెలియని పరిస్థితి. ఈ దశలో ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన కృష్ణారావు తన మాట ఎవరూ వినడం లేదంటూ వాపోతున్నారు.



శ్యామలాంబ అమ్మవారు

మద్యం సిండికేట్

మున్సిపాలిటీలో మద్యం సిండికేట్‌గా మారినట్లు కనిపిస్తోంది. పక్కనే ఉన్న రామభద్రపురంలో నాణ్యమైన మందు దొరుకుతుందని సాలూరులో దొరకడం లేదని. అన్ని బ్రాండ్‌ల మద్యం అందుబాటులో ఉండడం లేదని మంత్రి సంధ్యారాణి ఇటీవల మాట్లాడారు. మున్సిపాలిటీలోని దుకాణాల్లో చీప్ క్వాలిటీ మద్యం విక్రయిస్తూ, నాణ్యమైన మద్యాన్ని బార్లలోనే విక్రయిస్తూ అధికంగా సొమ్ము ఆర్జిస్తున్నారని, వారంతా సిండికేట్‌గా మారారని మందుబాబులు వాపోతున్నారు. అయితే మంత్రి ఈ మాటలు మాట్లాడడంపై విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

దేవదాయశాఖలో రూ.90 వేలే నిధులా?

శ్యామలాంబ పండగ ఏర్పాట్లపై సమీక్షలో భాగంగా, దేవదాయ, ధర్మాదాయ శాఖలో ఎన్ని నిధులున్నాయని మంత్రి సంధ్యారాణి ప్రశ్నించగా, కేవలం 90 వేల రుపాయలే ఉన్నాయని ఆ శాఖ అధికారులు తెలపడం గమనార్హం. మరోవైపు భక్తులు చందాలను ఎత్తుకుంటున్నారు. తాగునీరు, పారిశుధ్యం, సామాజిక మరుగుదొడ్లు, శాంతిభద్రతలు తదితర అన్ని అంశాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లూ చేయాలని భక్తులు, ప్రజలు కోరుకుంటున్నారు. చూడాలి మరి శ్యామలాంబ పండగ ఎటువంటి ఆటంకాలు, అడ్డంకులు లేకుండా ఎలా వైభవంగా జరుగుతుందో?

ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శుల వినతిపత్రం



ఎంపీడీవో స్వరూపారాణికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మక్కువ: జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక వ్యాఖ్యలను నిరసిస్తూ మక్కువ మండలం పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు ఎంపీడీవో డీడీ స్వరూపరాణికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు రమేష్, సురేష్ మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో పంచాయతీ కార్యదర్శులపై జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక చేసిన వ్యాఖ్యలపై పంచాయతీ కార్యదర్శులంతా ఆవేదన చెందుతున్నారన్నారు. గ్రామపంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత కోరుతూ ఎంపీడీవో స్వరూపారాణికి వినతిపత్రం అందజేశారు. గ్రామ సచివాలయాల పర్యవేక్షణలో ఉన్న అధికారాలపై స్పష్టత వచ్చేవరకు గ్రామపంచాయతీ విధులు, సచివాలయ పరిధిలో తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని పనులు మాత్రమే నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలి



పాలక రంజిత్ కుమార్

పార్వతీపురం: గిరిజన ప్రాంతంలోని ఆస్పత్రుల్లో మలేరియా సహా అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు ఆస్పత్రిలో మలేరియా మందులు లేవని బయట కొనుక్కోవాలని వైద్యసిబ్బంది చీటీ రాసి ఇవ్వడంపై విస్మయం వ్యక్తం చేశారు. అన్ని రకాల మందులను ఆస్పత్రిలో అందుబాటులో ఉంచి గిరిజనుల ప్రాణాలను కాపాడాలని అధికారులను డిమాండ్ చేశారు.

మన్యం వీరుడు అల్లూరి సేవలు చిరస్మరణీయం



అల్లూరి సీతారామరాజుకు నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తదితరులు

సాలూరు: భారత స్వాతంత్ర్యసమరయోధుడు, మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు.అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం సాలూరు పట్టణంలోని తన గృహంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పువ్వల ఈశ్వరమ్మ, వంగపండు అప్పలనాయుడు, గిరిరఘు, లచ్చయ్య, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

పండగ ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌డీసీ



పనులను పరిశీలిస్తున్న ఎస్‌డీసీ టి. ధర్మచంద్రారెడ్డి

సాలూరు: పట్టణంలోని శ్యామలాంబ పండగ ఏర్పాట్లను ఎస్‌డీసీ టి.ధర్మచంద్రారెడ్డి పరిశీలించారు. ఈ మేరకు బుధవారం పట్టణానికి వచ్చిన ఆయన శ్యామలాంబను దర్శించుకున్నారు. అనంతరం అక్కడ జరుగుతున్న పండగ ఏర్పాట్లపై ఆరా తీశారు. సిరిమాను రథం తిరిగే ప్రాంతాలు, ట్రాఫిక్, తదితర పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌వీరమణ, మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, ఎంపీడీఓ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

దొంగ మస్తర్లు, అక్రమ వసూళ్లపై ధ్వజమెత్తిన సభ్యులు

- సర్వసభ్య సమావేశంలో అధికారులపై ఆగ్రహం



ఉపాధి హామీ ఏపీఓను ప్రశ్నిస్తున్న వైస్‌ఎంపీపీ రెడ్డిసురేష్



విద్యుత్ శాఖ అధికారులకు సమస్యలు వివరిస్తున్న సభ్యులు

సాలూరు రూరల్: ఉపాధి పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని కూలీల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక్కొక్కరి దగ్గర రూ.100 వసూలు చేయడంతో పాటు విశాఖపట్నంలో ఉన్న వారితో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిపేర్లు కూడా మస్తర్లలో ఉంటున్నాయని శివరాంపురం ఎంపీటీసీ కళ్ళేపల్లి త్రినాథ ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం సాలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ గొల్లపల్లి పార్వతి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో తొలుత వ్యవసాయ శాఖ ఏఓ అనూరాధ మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. అయితే శివరాంపురం ఎంపీటీసీ కె.త్రినాథ మాట్లాడుతూ బయట మార్కెట్లో కంటే ప్రభుత్వం ఇచ్చే ధర ఎక్కువగా ఉందని ఇచ్చిన సబ్సిడీ ఖర్చులకు కూడా రాకపోవడంతో రైతులు కొనుగోలుకు ముందుకు రావడం లేదన్నారు. గతంలో ఇలా ఉండేది కాదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని ఏఓ సమాధానమిచ్చారు. అలాగే మట్టి నమూనాలు సేకరిస్తున్నామని రైతులు ఈ విషయంలో అధికారులకు సహకరించేలా చూడాలని సభ్యులను ఆమె కోరారు.

గోశాలలు ఎలా మంజూరు చేశారు?

అనంతరం పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి మాట్లాడుతూ పశువుల కోసం ఇన్సూరెన్స్ విషయాన్ని తెలియజేశారు. అదే సమయంలో గోశాలలు ఏ ప్రాతిపదికన మంజూరు చేశారు? కనీసం సర్పంచ్‌ల తీర్మానం లేకుండా ఎలా మంజూరు చేస్తారని ఎంపీటీసీ త్రినాథతో పాటు వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్ ఆయనను ప్రశ్నించారు. వార్డు మెంబర్ కూడా కాని వ్యక్తులు గోశాలల విషయంలో పెత్తనం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు పశువులు లేనివారికి గోశాలలు మంజూరు చేయడమేమిటని ప్రశ్నించారు. దీనికి వైద్యాధికారి బదులిస్తూ పై నుంచి వచ్చిన లిస్టు ప్రకారం గోశాలలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఏపీఓ రామకృష్ణ, ఏపీఎం జయమ్మ తీరుపై వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీ సురేష్, త్రినాథలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి ఫీల్డ్ అసిసెంట్లపై చర్యలు తీసుకోవడంలో పక్షపాతం ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. దీనికి ఎంపీడీఓ పార్వతి మాట్లాడుతూ అటువంటిది ఏమీ జరగలేదని సమాధానమిచ్చారు.

సమస్యలపై సమ్మెబాట విజయవంతం చేయాలి



ఇన్‌చార్జి ఎంపీడీఓ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

సీతానగరం: ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించనందుకు నిరసనగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు చేపట్టనున్న సమ్మె నోటీసును ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమారవర్మకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అందలమెక్కిన అనంతరం మరిచారని, వాటినిగుర్తు చేసినా పాలకులు పట్టించు కోలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటు పరం ఆపాలని, పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె. గౌరు, కె.ఆనంద్, జి బలరాం, ఎం. సీతమ్మ పాల్గొన్నారు.

అల్లూరికి ఘనంగా నివాళులు



పెద పెంకిలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలవేస్తున్న సంజీవనాయుడు, తదితరులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద విప్లవజ్యోతి మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ మేరకు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవ నాయుడు సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామరాజు వంటి పోరాట యోధుడి వద్ద తెల్లదొరల ఆటలు సాగలేదన్నారు. మన్నెంలో తెల్ల దొరల ఆగడాలకు తలలొంచిన ప్రజలకు అండగా ఉండి వారిలో చైతన్యం నింపి వారిని విప్లవ వీరులుగా తీర్చిదిద్దిన మహానుభావుడు అల్లూరి అని అటువంటి నాయకుడిని తెల్లదొరలు దారుణంగా పొట్టనపెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో కె.గౌరీనాథ్, చందు, టి.మురళి, ఎం.సత్యంనాయుడు, జి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాదాలమ్మవారి పండగ



నెత్తిన ఘటాన్ని, అధిష్ఠించి మొక్కుతీర్చుకున్న ఇంజినీరింగ్ విద్యార్థి దుర్గాప్రసాద్



ఘటంతో అమ్మవారిని ఉత్సాహపరుస్తున్న తుడుంకుండ వాయిద్య కళాకారుడు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అమ్మవారి జాతరల్లో భాగంగా బుధవారం నీలకంఠాపురంలో పాదాలమ్మవారి పండగను ఉత్సవకమిటీ ఘనంగా నిర్వహించింది. ఈ మేరకు గ్రామంలో తుడుంకుండ వాయిద్యాలతో అమ్మవారి ఘటాలతో తిరువీధి జరిగింది. తుడుంకుండ కొట్టిన 13 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థి వివిధ బాణీల్లో చేసిన విన్యాసం పలువురిని ఆకర్షించింది. అలాగే ఇంజినీరింగ్ చేస్తున్న విద్యార్థి అమ్మవారి ఘటాన్ని నెత్తిన పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నాడు. అమ్మవారిని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బి చిట్టిరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి శ్రీరాములునాయుడు, జిల్లా నాయకులు బి.శంకరరావు, బి.ముకుందరావు, ఎం. మన్మథరావు, వెంకటాపురం సర్పంచ్ బి.శ్రీనివాసరావు, బక్కుపేట మాజీ సర్పంచ్ బి.సూర్యనారాయణ, పి.బలరాంనాయుడు, వై గోపాలనాయుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్. తిరుపతిరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

అనుమతులు లేని మందులు విక్రయిస్తే చర్యలు

పార్వతీపురం రూరల్: అనుమతులు లేని మందులు విక్రయించినా, వైద్యుల సిఫార్సులు లేకుండా నార్కోటిక్ డ్రగ్స్, యాంటీ బయోటిక్ మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి మెడికల్‌షాపు యజమానులను హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మంటపంలో మెడికల్ షాపుల యజమానులు, డ్రగ్స్ కంట్రోల్ అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల వల్ల మెదడు మన అధీనంలో ఉండక మత్తు పదార్థాలు ఇంకా ఇంకా కావాలని, దానివల్ల తెలిసో తెలియకో ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా ఇబ్బందులు ఎదుర్కొని నేరాలకు పాల్పడి జీవితం నాశనం చేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే 1972కు అందించాలని సూచించారు. గంజాయిని అరికట్టాలనే ఉద్దేశంతో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వద్దు బ్రో వాల్‌పోస్టర్‌ను, మాదక ద్రవ్యాలు- మత్తు పదార్థాలు (మామ)అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఈగల్ ఫోర్స్ ఎస్పీ కె.నగేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ సీఐ టి.కల్యాణి, పట్టణ సీఐ మురళీధర్, సీసీఎస్ సీఐ అప్పారావు, అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్స్ కంట్రోల్ ఆశాషేక్, మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలి

పార్వతీపురం రూరల్: వృత్తి శిక్షణలో భాగంగా మహిళలకు ఇస్తున్న కుట్టు మిషన్ల శిక్షణను సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరు కావాలని పార్వతీపురం ఎంపీడీఓ జి.రమేష్‌బాబు అన్నారు. ఈ మేరకు బుధవారం స్టాప్‌ప్రో ఆధ్వర్యంలో మండల పరిధిలో ఉన్న మహిళలకు ఇస్తున్న శిక్షణ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరు కావాలని, లేనట్లెతై వారికి కుట్టు మెషీన్‌లు ఇవ్వడం కుదరదన్నారు. శిక్షణ కేంద్రంలో వేసవి తీవ్రత దృష్ట్యా ఫ్యాన్లు, తాగునీరు, మరికొన్ని మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

టీకా వివరాల నమోదు తప్పనిసరి

పార్వతీపురం రూరల్: సార్వత్రిక టీకా కార్యక్రమంలో పిల్లలకు వేసిన టీకాల వివరాల నమోదు తప్పనిసరి అని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్‌మోహన్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఎంఆర్ నగరంలో టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పిల్లల వయస్సును బట్టి వేయాల్సిన అన్ని టీకాలు కచ్చితంగా పూర్తిచేసి యువిన్, ఆర్‌సీహెచ్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గృహ సందర్శన చేసి ఎప్పటికప్పుడు పిల్లలు, బాలింతల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, ఏఎన్‌ఎం పోలమ్మ పాల్గొన్నారు.